


# వేయి రూపాయల నోటు

అధికార్లతో బాగా పలుకుబడిగల ఏడు

కొండల్రావు ప్రసిద్ధికెక్కిన కంట్రాక్టరు తన వృత్తి ధర్మంలో ఏ కాంట్రాక్టుపని తలపెట్టినా, దానితోపాటు ఆతని ప్రైవేటు ఎస్టేటులో ఒక భవంతి కూడా లేచేది. ఒక్కొక్క భవంతే, కాంట్రాక్టుపనితోసహా పూర్తికాగానే, ఇలవేల్పయిన ఏడుకొండలవాడికి ఏడుకొండల్రావు కళ్యాణమహోత్సవం చేయిస్తూ ఉండటం రివాజు

ఉత్సవంతోపాటు పేదలకు అన్నదానాదులు జరుపుతూ ఉండటంకూడా రివాజే

"అన్నదాత" అనేవాళ్ళు పేదలు

"కష్టార్జితం కాబట్టే ఆ వెంకటేశ్వరుడు చల్లనిచూపు చూస్తున్నాడు!" అనేవాడు ఆప్తమిత్రులు.

కిట్టనివాళ్ళందరికీ ఉంటారు. ఏడుకొండల్రావుకి కిట్టనివాళ్ళు—

"దొంగముండాకొడుకు! దోచేస్తున్నాడు!" అనుకుంటే అనుకునేవారు. అదో లెక్కా?

ఏమాట కామాటే! కంట్రాక్టరు ఏడుకొండల్రావు పన్లోపనిగా, తన భవంతితో పాటే, తనక్కావలసిన ఒక్కొక్క అధికారికీకూడా, "ఇతోధికమైన సేవ" చేస్తూనే ఉండేవాడు. ఆ సేవ, ఒక చిన్న సైజు పెద్ద భవంతి రూపాన విలసిల్లేది

కంట్రాక్టరైన ఏడుకొండల్రావు, ఊరిమధ్యగా పోతున్న కాలవ మీద ఇటూ ఆటూ రోడ్డు కలుపుతూ ఉండే కర్ర వంతెన బదులు, కాంక్రీటూ ఇనుమూ ఉపయోగించి, శాశ్వతంగా నాలుగు కాలాలపాటు మన్నే గట్టివంతెన నిర్మించే బాధ్యత నెత్తిమీద వేసుకోక తప్పలేదు.

అతనిక్కావలసిన అధికార్లు ఆ బాధ్యత, అతనికే అంటకట్టకా తప్పలేదు.

టెండర్లలో రెండు లక్షలు ఖర్చు చూపిన పోటీ కంట్రాక్టరుకి వంతెన కట్టడం పాతకాకపోవచ్చు పొమ్మన్నారు అధికార్లు అధికార్లు వేసుకున్న మూడు లక్షలఅంచనాచూపించినఏడుకొండల్రావు నెత్తిమీదనే ఈ భారం పడకాతప్పలేదు.

“యాభై వేలెట్టి ఆఫీసరుగారి కో యిల్లు కట్టిస్తున్నాడు- మా మూ లే.” అన్నారు కిట్టనివాళ్ళు - సగం సగం లేస్తున్న ఒక యింటిని చూసి.

సరిగ్గా అటువంటి సమయంలోనే కింది స్థాయిలో ఒక జూనియర్ ఇంజనీరుకొత్తగా బదిలీఅయి రాకా తప్పలేదు

జూనియర్ ఇంజనీర్లు పానకంలో పుడకలు. అయితే ఏడుకొండల్రావు ఇల్లాంటి జూనియర్‌గాళ్ళని లక్షమందిని చూశాడు వాళ్ళ చేతుల్లో ఇరుక్కుపోయిన బిల్లుల్ని - అవలీలగా పైకి గాలం వేసి చేపను లాగినట్టు లాగేసేవాడు ఆ కిటుకులూ, మెళకువలూ ఏడుకొండల్రావుకి తెలిసినంతగా ఇతరులకుతెలీదు

జూనియర్ ఇంజనీరు. కంట్రాక్టరు చేసినంతవరకూ పని సక్రమంగానే ఉందని సంతకం పెడితేగాని, యాభై వేల రూపాయల బిల్లుల తాలూకు చెక్కు బయటికి ఊడిపడనిస్థితి మేకులాగా లేచి కూర్చున్నది

కంట్రాక్టరు ఏడుకొండల్రావు కొత్తగావచ్చిన జూనియర్ దగ్గరకు పోవటం అదే మొదటిసారి

జూనియర్ గదిలో జూనియర్‌తప్ప ఇంకెవరూలేని సమయం చూసి ఏడుకొండల్రావు, స్వయంగా వెళ్ళాడు. లోపలి జేబులోంచి వేయిరూపాయల నోటు అనబడే ఒక మహా పచ్చకాగితం బయటకు లాగి, జూనియర్‌మీదకు విసిరి, “నమస్కారం!” అన్నాడు.

జూనియర్, వేయిరూపాయల నోటు ఒకసారి తీసి, అటూ యిటూ తిప్పి పరిశీలించి, పక్కనే పెట్టి, జేబులోంచి సిగరెట్ పాకెట్ బయటకులాగి, ఒకటి నోట్లో పెట్టుకొని,

“పుచ్చుకోండి” అంటూ, ఏడుకొండల్రావుకి పాకెట్ అందిచ్చాడు

ఏడుకొండల్రావొక సిగరెట్ నోట్లో పెదవులమధ్య పెట్టాడు

జూనియర్ ఒక అగ్గిపుల్ల వెలిగించాడు అగ్గిపుల్ల చివరిదాకా కాలేవరకూ తమాషా చూసి, అది ఆరిపోతుందనగా, వేయి రూపాయలనోటుతీసి పట్టుకొని, ఒక చివర ముట్టించాడు

కాలుతున్న నోటుని ఒక చివరపట్టి ఎత్తి, ఏడుకొండల్రావు సిగరెట్టు ముట్టించటానికి సాయపడ్డాడు

నోటు పూర్తిగా భస్మమయ్యేలోపున తన సిగరెట్టూ ముట్టించేశాడు. నోటు బూడిదయి “ఫైల్సు” మీద పడింది.

ఏడుకొండల్రావు ఎండిన పెదవుల కంటుకున్న సిగరెట్టు ఊడిరాక, వేళ్ళ మధ్యనుంచి లాగబోతే సిగరెట్టు జారి వేళ్ళమధ్య చుర్రుమన్నది

కంట్రాక్టరుగానీ, జూనియర్‌గానీ ఏమీ మాట్లాడలేదు మాట్లాడేటందుకేమీ లేదు_అవసరమూ లేదు!